# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ 2047 లో భాగంగా భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్ధిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

- ❖ కేంద్రమంత్రి మండలి పలుకీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

- ❖ ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు.

- ❖ ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా రెండవ సెమీఫైనల్ మ్యాచ్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతోంది.

========================

వికసిత్ భారత్ 2047 లో భాగంగా భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్ధిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. బడ్జెట్ అనంతరం ఉద్యోగ కల్పన అంశంపై నిర్వహించిన వెబినార్‌లో దృశ్య మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలలో నైపుణ్యాభివృద్ధి, ప్రతిభను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోనే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందన్నారు. నాణ్యతతో కూడిన వైద్య సేవలను క్షేత్రస్థాయి వరకూ తీసుకువెళ్ళాలనేదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో కృత్రిమ మేధ (AI)తో కూడిన విద్యా విధానానికి అధిక నిధులు కేటాయించామన్నారు. దేశ అభివృద్ధికి ప్రతిభ, సామర్ధ్యాల పెంపు మూల స్తంభాలని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

రక్షణ రంగ పరిశోధన సంస్థ (DRDO) ల్యాబ్ డిఫెన్స్ బయో - ఇంజనీరింగ్ , ఎలక్ట్రో మెడికల్ లాబొరేటరీ (DEBEL), LCA తేజస్ విమానం కోసం దేశీయంగా రూపొందించిన ఆన్-బోర్డ్ ఆక్సిజన్ జనరేటింగ్ సిస్టమ్ (OBOGS) ఆధారిత ఇంటిగ్రేటెడ్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ (ILSS) పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ DRDO, భారత వైమానిక దళం, ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమ భాగస్వాములను అభినందించారు. రక్షణ సాంకేతికతలో దేశ నిబద్ధతను ఇది బలోపేతం చేస్తుందని, 2047 వికసిత్ భారత్ దార్శనికతను సూచిస్తుందని అన్నారు.

========================

సోన్ ప్రయాగ్ నుండి కేదార్‌నాథ్ వరకు 12.9 కిలోమీటర్ల పొడవు గల రోప్‌వే అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 4 వేల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్రమంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలను అశ్విని వైష్ణవ్  ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులకు వెల్లడిస్తూ... రోప్‌వే నిర్మాణం యాత్రికుల ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ దివ్యాంగులు, వృద్ధులకు ఎంతో సహాయపడుతుందని పేర్కొన్నారు. అలాగే హేమకుండ్ సాహిబ్ రోప్‌వేను కూడా అభివృద్ధి చేయనున్నామని, ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రెండు వేల 730 కోట్ల రూపాయలు అవుతుందని తెలిపారు. పశువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణకు ప్రభుత్వం 3 వేల 880 కోట్ల రూపాయలను కేటాయించేందుకు నిర్ణయం తీసుకుందని కేంద్రమంత్రి  వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు ముఖ్య  పాత్ర పోషిస్తున్నారని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశంలో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో  మోడల్ మహిళా - స్నేహపూర్వక గ్రామ పంచాయతీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ... మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,  ఇది 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి దోహదపడుతుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వేడుకల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ దీనిని ప్రారంభించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక మోడల్ ఉమెన్ - ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమ ప్రాథమిక లక్ష్యం.

విరామం

========================

భారతదేశ సాంకేతికతలో ఆవిష్కరణ, స్థిరత్వం, సమ్మిళితత్వం అనేవి ప్రధాన మార్గదర్శకాలని కేంద్ర ప్రసార శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో కేంద్రమంత్రి మాట్లాడుతూ... దేశంలోని ప్రతి పౌరుడికి సేవ అందించడంలో ఆధార్, భారత్ నెట్ విజయం సాధించిందన్నారు. వివిధ ప్రక్రియలను సులభతరం చేయడానికి టెలికాం నియంత్రణను ప్రవేశపెట్టామని, వినియోగదారుల రక్షణ కోసం సైబర్ భద్రతా చర్యలను తీసుకువచ్చామని కేంద్రమంత్రి వివరిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

========================

భారత్ ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్ (వేవ్స్) 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్ లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా- వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

=========================

ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC)కి నవరత్న హోదా లభించడం సంస్థ ఆర్థిక నిబద్ధతకు నిదర్శనమని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ కుమార్ దూబే అన్నారు. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అమృత్ కాలంలో భారతదేశం 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు పయనిస్తోందని, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆధునీకరణకు వనరుల సమీకరనలో IRFC ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నవరత్న హోదా గుర్తింపు సంస్థ సామర్థ్యాలను విస్తరించడానికి, దేశ వృద్ధికి మరింత దోహదపడటానికి ప్రేరేపిస్తుందన్నారు.

(వాయిస్ 33 సెకన్లు)

=========================

తమ దేశంతో వ్యాపారం చేస్తున్న దేశాలపై పరస్పర సుంకాలను అమలు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈరోజు జరిగిన అమెరికా కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ట్రంప్ మాట్లాడుతూ.. భారత్, చైనా సహా పలు దేశాలపై పరస్పర సుంకాలు అమలు చేస్తున్నామని, ఇవి ఏప్రిల్ 2 నుండి అమల్లోకి రానున్నాయని వెల్లడించారు. దశాబ్దాలుగా ఇతర దేశాలు తమపై అధిక సుంకలు విధిస్తున్నాయని, అందుకు ప్రతిగా అంతే సుంకాలను తాము కూడా విధిస్తున్నామని ట్రంప్ తెలిపారు.

=========================

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్ 363 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 362 పరుగులు చేసింది. ప్రస్తుతం బ్యాటింగ్ చేస్తున్న దక్షిణాఫ్రికా 27 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఆదివారం దుబాయ్ లో జరిగే ఫైనల్ మ్యాచ్ లో భారత జట్టుతో తలపడనుంది.

=========================
=========================